www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

| తెలంగాణ | బుధ వారం, 10 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-123 | పేజీలు - 4 వెల రూ. 5/- |
|---|---|---|---|---|

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

# భక్వాస్ త్యాగాలు

### పదవి కాలం ముగియకుండానే నాడు ఎమ్మెల్సీ, నేడు ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు

- మాయ మాటలతో ప్రజాకూటమి
- ప్రజా కూటమి అభ్యర్ధిగా గెలుపొందిన రాజగోపాల్ రెడ్డి
- కమ్యునిస్టు, టీడీపీ ఓటర్ల నమ్మకాన్ని ఒమ్ము చేసిన రాజగోపాల్
- ఉపఎన్నికలలో బుద్ధి చెప్పేందుకు సదరు ఓటర్లకు ఛాన్స్



### రాజగోపాల్ 'రాంగ్' గోపాల్

ఉపఎన్నికలో ఈసారి ఓటరుకు డబ్బుతో మభ్యపెట్టియ్యలేను అనుకున్నాడేమో బహుషా... సెంటిమెంట్ రాజకీయాలకు తెరలేపుతున్నాడు రాజగోపాల్‌రెడ్డి. గత ఎన్నికలలో డబ్బు మదంతో అంగట్ల సరుకులెక్క ఓటర్లను ప్రలోభపెట్టి, ఓట్లను కొని, ప్రజస్వామ్యాన్ని అపహాస్యం చేసి, ప్రజల జీవితాలతో చెలగాటమాడిన రాజకీయ బడాచోర్ మరోమారు ఉప ఎన్నికలకు తెరలేపిండు. మతోన్మాదాన్ని తన వంటి నిండ జుప్పించుకొని మత రాజకీయాలను ప్రభోదించడానికి రాబోతున్నాడు. రంగులు మార్చే ఊసరవెల్లిలా ప్రతిసారి ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేయ్యాలని చూసే రాజగోపాల్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలే. నాడు ఓటు వేసిన కమ్యునిస్టులు, టీడీపి, ఇతర పార్టీలు మేలుకొని డబ్బు అహంకారంతో విర్రవీగుతున్న బుద్ధిహీనుడికి బుద్ధి చెప్పాలంటే, ప్రజాస్వామ్య పరిపాలనకు పనికిరాడని నమ్మి ఓటు రూపంలో తీర్పు చెప్పాలే.

- కమ్యునిస్టు ఓట్లు దాదాపు 20,000 ఓట్లు
- టీడీపీ ఓట్లు దాదాపు 7,000 ఓట్లు
- గత ఎన్నికలో ప్రజాకూటమి పేరుతో రాజగోపాల్‌రెడ్డికి వేసిన ఓటర్లు
- ఉపఎన్నికలో కీలకంగా మారనున్న టీడీపీ, సిపిఐ, సీపీఎం ఓట్లు
- కమ్యునిస్టులు తమ అభ్యర్ధిని నిలబెట్టితే చరిత్రహీనులుగా మిగిలే అవకాశం
- చేసిన తప్పను సరిదిద్దుకోవాలంటే కాంగ్రెస్ లేదా టీఆర్ఎస్‌కు మద్దతు పలకాలి
- లేని పక్షంలో రాజగోపాల్‌రెడ్డికి, బీజేపీకి ప్లస్ అయ్యే ఛాన్స్
- రాష్ట్ర రాజకీయాలను తారుమారు చేసేది కమ్యునిస్టు, టీడీపీ ఓట్లు కావచ్చు



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** త్యాగం పేరుతో మునుగోడు ప్రజలను మరోమారు మోసం చేసేందుకు మునుగోడులోకి అడుగు పెట్టేందుకు సిద్ధమౌతుండు రాజగోపాల్‌రెడ్డి. గత ఎన్నికలలో ప్రజాకూటమి అభ్యర్ధిగా గెలుపొందిన రాజగోపాల్‌రెడ్డి కమ్యునిస్టు, టీడీపి ఓటర్లను కలుపుకోవడంతో తన గెలుపుకు ఊతమిచ్చింది. అంతకంటే ముందు ఎమ్మెల్సీ పదవి రెండు సంవత్సరాల కాలం మిగిలి ఉండగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, ఆ వెంబడే మునుగోడు ఎన్నికల బరిలో ప్రజాకూటమి అభ్యర్ధిగా రాజగోపాల్‌రెడ్డి నిలబడ్డారు. మరో మారు పదవి కాలం ముగియక ముందే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేయడం వల్ల ప్రజలకు వచ్చే లాభం ఏమిటో తనకే తెలియాలి. తన రాజీనామా చారిత్రాత్మక అవసరం అని ఊదరగొడుతున్న రాజగోపాల్‌రెడ్డి స్వలాభంకోసం కాకపోతే మరో కారణం ఏమైనా ఉందా !. ప్రజా కూటమి అభ్యర్ధిగా గత ఎన్నికలో 20,000 3వ

## మునుగోడులో రాజగోపాల్ రెడ్డి

# మునగడం ఖాయం

### కుటుంబ పాలనపై రాజగోపాల్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ, ఆగస్ట్ 9 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి మునగడం ఖాయం. కుటుంబ పాలన గురించి రాజగోపాల్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నల్లగొండ లోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కుటుంబ పాలన అంటున్న రాజగోపాల్ రెడ్డికి ఆయన సోదరులు, భార్య కనిపించలేదా? స్వార్ధ ప్రయోజనాల కోసం రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారన్నారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా వ్యక్తిగతంగా రాజగోపాల్‌కు.. రాజకీయంగా బీజేపీకి అవసరం. మునుగోడు అభివృద్ధి కోసం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయంగా విస్తరణ కోసమే బీజేపీ రాజగోపాల్ రెడ్డితో రాజీనామా చేయించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం కోసమే బీజేపీ ఉప ఎన్నికల వ్యూహం పన్నిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో రాష్ట్రానికి తీరని నష్టం అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆయన తెలిపారు. 2వ

# కోమటి రెడ్డి బ్రదర్స్‌ను రెచ్చగొడుతున్న రేవంత్

### నల్లగొండలో పుట్టి ముంచేలా పిసిసి చీఫ్ వ్యాఖ్యలు

### 21 అమిత్ షా రాకతో మారనున్న సమీకరణాలు


### కాంగ్రెస్‌కు మరిన్ని దెబ్బలు తగలగలవన్న అంచనాలు

### మునుగోడుతో టిఆర్ఎస్‌ను ఆత్మరక్షణలో పడేయాలన్న బిజెపి వ్యూహం



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీని వీడేందుకు అనేకులు సిద్ధపడటంతో.. కాంగ్రెస్‌లో కల్లోలం మొదలైందనే చర్చ సాగుతోంది. అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు కాంగ్రెస్ నేతలు రంగంలోకి దిగు తున్నారు. మొత్తానికి మరో పదిరోజుల్లో అమిత్‌షా రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో..అప్పటివరకు తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎంతమంది బీజేపీ వైపు చూస్తారన్నది ఆసక్తికరంగా మారింది.ఓ వైపు మునుగోడు ఉప ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ అందరికన్నా ముందే సమరశంఖం పూరించింది.మునుగోడులో కాంగ్రెస్ సభ నిర్వహించడంతో కోమటిరెడ్డి బ్రదర్స్‌కు పుండుమీద కారం చల్లినట్లు అయ్యింది. కోమటిరెడ్డి పార్టీ మారుతానని చెప్పి రాజీనామా చేయగానే రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మునుగోడు సభను నిర్వహించి అన్నదమ్ములకు సవాల్ విసిరారు. అలాగే బ్రదర్స్‌ను రెచ్చగొట్టేలా అద్దంకి దయాకర్ లాంటి వారితో వ్యాఖ్యలు చేయించారు. తరవాత క్షమాపణలు చెప్పించారు. అంతకు ముందే ఉన్నట్టుండి ఆయన కేంద్ర హోంమంత్రి, బీజేపీ ముఖ్యనేత అమిత్ షాతో వెంకట్‌రెడ్డి సమావేశం కావడం.. అది కూడా తన సోదరుడు, బీజేపీలో చేరనున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భేటీ అయిన కొద్దిసేపటి వ్యవధిలోనే కలవడం రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది. తన ఓటమి కోసం పనిచేసిన చెరుకు సుధాకర్‌ను పార్టీలో ఎలా చేర్చుకుంటారని ఆయన రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. ఈ విషయంలో నేరుగా రాహుల్ గాంధీ, 2వ

## బిజెపిని నిలదీయాల్సిందే: లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, ఆగస్ట్ 9 (సమ సమాజం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జై శ్రీరామ్ అంటూనే నొప్పి తెలియకుండా ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారని స్థానిక ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. నరేంద్రమోదీ ఉచితాలు వద్దని చెప్తున్నారని, అంటే రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను వద్దని చెప్తున్నట్లేనని పేర్కొన్నారు. పొరపాటున బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే పెన్షన్‌లు, రైతుబంధు, రైతుబీమా, 2వ

## తెలంగాణ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలు

### నేటి నుంచి 21వరకు 12 రోజుల పాటు ప్రత్యేక ఆఫర్లు

### ఆగస్టు 15వ తేదీన పుట్టిన చిన్నారులందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం

### 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వృద్ధులకూ వర్తింపు



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** 75వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ వినూత్న 2వ

# మునుగోడు సభతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

### సైలెంట్‌గా సాగుతున్న టిఆర్ఎస్ వ్యూహాలు ❑ పావులు కదుపుతున్న మంత్రి జగదీశ్ రెడ్డి



**నల్లగొండ, ఆగస్ట్ 9 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక అంశం రోజురోజుకూ వేడెక్కుతోంది. బహిరంగ సభతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బోణీ చేయగా, ఈనెల 21 చౌటుప్పల్‌లో భారీ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు ప్రారంభించారు. ఉప ఎన్నికకు సంబంధించి అధికార టీఆర్ఎస్ సైలెంట్ ఆపరేషన్‌కు తెరలేపింది.నిర్వహించిన సభ విజయవంతం కావడం కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రాజగోపాల్ రాజీనామాతో పార్టీ మొత్తం ఖాళీ అవుతుందన్న అంచనాలో ఉండగా, వాటిని బ్రేక్ చేస్తూ సభ జరిగింది. ఉప ఎన్నికలో గెలుపుకోసం ఊరూరా తిరుగుతానని, ప్రతీ యువకుడిని కలుస్తానని రేవంత్ ప్రకటించారు. ఆర్థికంగా, సామాజికంగా బలమైన అభ్యర్థి అందుబాటులోకి రావడం కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్కు ఊరటనిచ్చింది. కొద్ది రోజుల్లోనే ఐదుగురు సభ్యులతో కూడిన 3వ

## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

### గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** ఇంటింటా మువ్వన్నెల జెండాను ఎగురవేస్తూ జాతీయతను చాటి చెప్పాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఛాయాచిత్రాల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన నేపథ్యంలో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవాలను ప్రారంభించిందన్నారు. ఎందరో త్యాగాల ఫలాన్ని మనం అనుభవిస్తున్నామన్నారు. జాతీయ భావాన్ని బలోపేతం చేస్తూ ఈ నెల 13వ తేదీ నుంచి 15వ 2వ

## బిజెపి దూకుడును కెసిఆర్ ఎలా ఎదుర్కొంటారు

### ఎలాంటి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు

### సర్వత్రా ఇప్పుడు రాజకీయంగా ఇదే చర్చ

### మోడీని ఢీకొనే వ్యూహంలో కెసిఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** తెలంగాణలో బీజేపీ నుంచి ఎదురవుతున్న గట్టి సవాళ్లను తక్కువగా చేయడానికిలేదు. బిజెపిని అదేపనిగా విమర్శిస్తున్న టిఆర్ఎస్‌కు ఉనికి లేకుండా చేయడం ద్వారా కెసిఆర్ పాలనకు తెరదించాలన్న కక్షతో కమలం పావులు కదుపుతోంది. ఈ సవాల్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎలా ఎదుర్కొంటారన్నదే ఇప్పుడు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లకుండా...ఆయన కేంద్రంపై తనకున్న వ్యతిరేకతను మరోమారు చాటుకున్నారు. అలాగే బ్యాంకుల్లో ఎన్‌పిఎలు, ఎగవేతలు, 5జి స్పెక్ట్రమ్ వేలం తదితర అంశాల్లో కెసిఆర్ సవాల్ విసిరారు. ఇది ఓ రకంగా జాతీయ రాజకీయాల్లో చర్చగా మారే అవకాశం ఉంది. బిజెపిని వ్యతిరేకిస్తున్న వారు కెసిఆర్ సవాళ్లను సమర్థిస్తున్నా..ఆయనతో గట్టిగా కలసి నడిచేందుకు ఎవరు కూడా అడుగు వేయడం లేదు. మరోవైపు జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలనుకుంటున్న కేసీఆర్‌కు మునుగోడు ఉప 2వ

## జీవో 121 అమలు నిలిపివేత

### నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు



**హైదరాబాద్,ఆగస్ట్ 9 (సమ సమాజం):** వీఆర్వోలను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర సర్కార్ జారీ చేసిన జీవో నంబర్ 121 అమలును హైకోర్టు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్దుబాటు జీవో చట్ట వ్యతిరేకంగా ఉందని అభిప్రాయపడింది. జీవోలోని మూడో పేరాలోని విషయాలు యాక్ట్‌లోని 4(1)కి వ్యతిరేకంగా ఉన్నాయని, అందుకే జీవో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటి వరకు వేరే శాఖల్లోని ఉద్యోగాల్లో చేరని వాళ్లను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. జీవో 121పై స్టే విధిస్తూ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలిచ్చింది. రూల్స్ రూపొందించకుండానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన జీవో ద్వారా వీఆర్వో పోస్టులు రద్దు చేశారని, జీవో 121 చట్ట విరుద్ధంగా ఉందని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. జీవోను సవాల్ చేస్తూ వీఆర్వో రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ జి.సతీశ్, మరొకరు వేసిన రిట్‌పై సోమవారం విచారించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేసింది. వీఆర్వోలు 98 శాతం మంది లాటరీ ద్వారా కేటాయించిన శాఖల్లో

## సంపాదకీయం

# నీతి ఆయోగ్ నిబద్ధతపై స్పష్టత రావాలి !

ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి నీతి ఆయోగ్ ఏర్పటు చేసిన తరవాత కేంద్రరాష్ట్రాల మధ్య సంబంధాలు, నిధులు బదలాయింపు తదితర విషయాల్లో కేంద్రం స్పష్టత ఇవ్వాలి. నిజానికి కేంద్ర రాష్ట్రాల మధ్య పెద్దగా సంబంధాలు సరిగా లేవు. నిధుల షేరింగ్ కూడా సక్రమంగా సాగడం లేదు. జిఎస్టీ బదలాయింపులు సక్రమంగా లేవు. ఇవన్నీచర్చించి, దేశానికి సరైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. అలాగే ఈ ఏడేళ్లలో ప్రణాళికా సంఘానికి భిన్నంగా నీతి ఆయోగ్ చేసిందేమిటో కూడా చెప్పాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ లేవనెత్తిన అంశాలనే ఇతరరాష్ట్రాల సిఎంలు కూడా ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఈదశలో విమర్శలకు తావులేకుండా ముందుకు సాగాల్సి ఉంది. ఇది దేశ అభివృద్ధికి సంబంధించిన విషయంగా చూడాలి. భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రణాళికా సంఘం స్థానంలో 2015 జనవరి 1న నీతి ఆయోగ్ సరికొత్త వ్యవస్థగా ఏర్పడింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు దీని పాలకమండలిలో సభ్యులుగా ఉన్నారు. దీనిలో ఐదుగురు పూర్తికాల సభ్యులు, ఇద్దరు పాక్షిక కాల సభ్యులు ఉంటారు. వీరిద్దరినీ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల నుంచి ఎంపిక చేసుకుంటారు. పదవిలో కొనసాగుతున్న కేంద్రమంత్రుల నుంచి నలుగురు దీనిలో సభ్యులుగా ఉంటారు. శక్తివంతమైన రాష్ట్రాలతోనే శక్తివంతమైన దేశం అనే విశ్వాసానికి అనుగుణంగా కీలకమైన విధాన నిర్ణయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన వ్యూహాత్మక, సాంకేతిక సలహాలను నీతి ఆయోగ్ అందిస్తుంది. ఇది ఆర్థికాంశాలతో పాటు ప్రాధాన్యం ఉన్న జాతీయ, అంతర్జాతీయ విషయాల పై సూచనలను ఇస్తుంది. జాతీయ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాలకు చురుకైన పాత్రను, భాగస్వామ్యాన్ని కల్పిస్తుందని ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందింపజేసే యంత్రాం గాన్ని తీర్చిదిద్ది, వాటి అమలు తీరును పర్యవేక్షించేలా లక్ష్యాలను నిర్దేశించారు. ఆర్థిక వ్యూహాలు, విధానాల్లో జాతీయ భద్రత ప్రయోజనా లను చూస్తుంది. ఆర్థిక పురోగతి నుంచి తగినంత లబ్ది పొందలేక పోతున్న సామాజిక వర్గాలపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, అందరికీ అవకాశాలు కల్పించడం, భాగస్వామ్య పాలన, సాంకేతిక వినియోగాన్ని పెంచడం వంటివి దీని ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించారు.అయితే ఇటీవలి కాలంలో ఆయారాష్ట్రాల సిఎంలు మాత్రం దీని లక్ష్యాలు నెరవేరడం లేదన్న వాదన చేస్తున్నారు. జిఎస్టీ వల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి పడిపోయిందని, జిఎస్టీ లాభాలను మరో ఐదేళ్లు పొడగించాలని ఇటీవలి జిఎస్టీ మండలి సమావేశంలో పలువురు సిఎంలు డిమాండ్ చేశారు. దీనిని కూడా నీతి ఆయోగ్ పరిగణనలోకి తీసుకోవాలి. ఇకపోతే గతంలో ప్రణాళికా సంఘం పంచవర్ష ప్రణాళికలను సిద్దం చేసి, నిధులు కేటాయించేలా చేసి అభివృద్ధికి దోహదపడేది. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. అసలు రూపాన్ని సీఎం కేసీఆర్ బయట పెడితే అది రాజకీయరంగు పులుము కుందన్న వ్యాఖ్యలు వచ్చాయి. దీనిపై కేందరమంత్రి కిషన్ రెడ్డి కూడా ఎదురుదాడి చేశారు. నిజానికి దాడులు, ఎదురుదాడులు రాజకీయాల్లో తప్ప అభివృద్దిలో కానరా వద్దు. సీఎం కెసిఆర్ అడిగిన ఒక్క ప్రశ్నకూ జవాబివ్వని నీతి ఆయోగ్.. బీజేపీకి వంతపాడుతూ పత్రికా ప్రకటన విడుదల చేయడం సిగ్గుచేటు, బాధ్యతారాహిత్యమని మంత్రి హరీష్ రావు కూడా అన్నారు. రాష్ట్రాలకు నిధులు ఇవ్వట్లేదని 15వ ఆర్థిక సంఘం, కాగ్.. రెండూ చెప్పాయి. 32 నుండి 42 శాతానికి రాష్ట్రాలకు నిధులు పెంచామని నీతి ఆయోగ్ అంటోంది. కానీ కేంద్రం.. సెస్సుల పేరుతో రాష్ట్రానికి రావాల్సిన వాటా రాకుండా చేస్తోంది. తద్వారా రాష్ట్రాల నోరు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ వాదనగా ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ వాదన ఇందుకు భిన్నంగా ఉంది. గత ఎనిమిదేళ్లుగా అభివృద్ధి విప్లవాన్ని నిశ్శబ్దంగా అమలు చేస్తున్న నీతి ఆయోగ్ మూలంగానే దేశంలో లక్షల కోట్ల మేరకు మౌలిక సదుపాయాలు అమలు అవుతున్నాయని అంటున్నారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అనేక సంక్లిష్ట మైన సమస్యలను కేంద్ర, రాష్ట్రాలతో కలిసి పనిచేయడం ద్వారా నీతి ఆయోగ్ పరిష్కరించింది. జీడీపీ పెరుగుదలలో మాత్రమే కాదు, అనేక నిర్మాణాత్మక ఆర్థిక సంస్కరణల వెనుక నీతి ఆయోగ్ హస్తం ఉన్న దన్న వాదన చేస్తోంది. దేశమంతా ఒక టీమ్ ఇండియా స్ఫూర్తితో పనిచేసినందుకే కరోనా మహమ్మారిని తిప్పిగొట్టగలిగామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నీతి ఆయోగ్ ఆదివారం నాడు జరిగిన ఏడవ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో అన్నారు. దేశాన్ని ఈ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా చేయడంలో రాష్ట్రాలు ప్రముఖ పాత్ర పోషించాయని ఆయన ప్రశంసించారు. పప్పు ధాన్యాలు, చమురు గింజలు, ఇతర వ్యవసాయోత్పత్తుల విషయంలో స్వయం సమృద్ధి, పంటల మార్పిడి, జాతీయ విద్యావిధానం అమలు, పట్టణ పాలనపై కీలక చర్చలు జరిగాయి. వివిధ రంగాల్లో కేంద్ర, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేసి దేశాన్ని అభివృద్ధి పరచడం ప్రపంచం దృష్టికి వచ్చిందని, అందుకే 2023లో జీ-20 నాయకత్వం భారత్‌కు లభించనున్నదని మోదీ ప్రకటించారు, భారతదేశమంటే ఢిల్లీ మాత్రమే కాదు, ప్రతి రాష్ట్రమూ, కేంద్రపాలిత ప్రాంతమూ కూడా అని ప్రకటించే సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. వర్తకం, పర్యాటక రంగం, టెక్నాలజీని ప్రతి రాష్ట్రం ప్రపంచంలోని మన రాయబార కార్యాలయాల ద్వారా పెంపొందించు కోవాలని, ఎగుమతులు పెంచుతూ దిగుమతులను తగ్గించుకోవాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రూపొందించిన 'వోకల్ ఫర్ లోకల్' రాజకీయ నినాదం కాదని, అది కేంద్ర, రాష్ట్రాల సమాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జీఎస్టీ వసూళ్లు పెరిగేందుకు కూడా కలిసికట్టుగా పనిచేయాలని, దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేయాలని చెప్పారు. జాతీయ విద్యావిధానాన్ని కూడా నిర్ణీత కాలంలో దేశమంతటా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అయితే బీజేపీ ప్రభుత్వం ఏడేళ్లలో సెస్సుల రూపంలో వసూలు చేసింది రూ.15,47,560 కోట్లు. ఈ ఏడాది రూ.5,35,112 కోట్లు. రెండూ కలిపితే.. మొత్తం రూ.21 లక్షల కోట్లు. 41 శాతం రాష్ట్రాల వాటా అంటే.. దానిప్రకారం రూ.8,60,000 కోట్లు హక్కుగా అన్ని రాష్ట్రాలకూ రావాలి. కానీ సెస్సుల పేరుతో కేంద్రం చేస్తున్న అన్యాయం కారణంగా.. తెలంగాణకు రావాల్సిన రూ.42 వేల కోట్లు రాకుండా పోయాయి. నీతి ఆయోగ్ విలువ దిగజారిందని కెసిఆర్ విమర్శించారు. రాష్ట్రాల హక్కులు పోతుంటే సహకార సమాఖ్య స్ఫూర్తి ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. నీతి ఆయోగ్ చేసే సిఫారసులను కేంద్రం చెత్త బుట్టలో వేస్తోందని అన్ని రాష్ట్రాల సిఎంలు దాదాపుగా అభిప్రాయపడుతున్నారు. కాగితాలపై కేటాయింపులు చేస్తున్నారని.. వాస్తవంగా నిధులు మాత్రం ఇవ్వట్లేదన్న విమర్శలు ఉన్నాయి. కేంద్రం తప్పులను కప్పిపుచ్చే విధంగా నీతి ఆయోగ్ ప్రవర్తించడం పట్ల కెసిఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవలి సమావేశానికి నిరసనగా గైర్హాజరయ్యారు. ఈ క్రమంలో సందేహాలను నివృత్తి చేయాలి. ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలి. దేశం యావత్తూ సమస్య కాబట్టి వివరణ సమగ్రంగా ఉండాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తెలంగాణ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలు

(మొదటి పేజి తరువాయి) కార్యక్రమాలు చేపట్టింది. అజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా ఈ నెల పదో తేదీ నుంచి 21వ తేదీ వరకు 12 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు, ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఆగస్టు 15వ తేదీన పుట్టిన చిన్నారులందరికీ వారికి 12 ఏళ్లు పూర్తి అయ్యేంత వరకు రాష్ట్రంలోని అన్ని సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. అదేవిధంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వృద్ధులు ఈ నెల 15న ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. వీటితో పాటు టీ-24 బస్ టికెటును ఆ రోజున రూ.75( సాధారణ రోజుల్లో రూ.120)కే అందిస్తామని ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు అన్ని బస్సులకు జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేస్తామని, ఉద్యోగులంతా అమృతోత్సవ్ బ్యాడ్జీలతోనే విధులకు హాజరు కావాలని సూచించారు. టీటీడీ ప్యాకేజీని వినియోగించుకునే ప్రయాణికులకు ఈ నెల 16 నుంచి 21 వరకు రూ.75 తగ్గింపు. గస్టు 15న కార్గోలో ఒక కిలో పార్సిల్ 75 కిలో మీటర్ల వరకు ఉచిత రవాణా. టాప్-75 ప్రయాణికులకు ఒక ట్రిప్ టికెట్ ఉచితం. శంషాబాద్ విమానాశ్రయానికి ఆగస్టు 15న పుష్పక్ ఎయిర్ పోర్ట్ సర్వీసును వినియోగించుకునే ప్రయాణికులు 75 శాతం ఛార్జీ చెల్లిస్తే సరిపోతుంది. 75 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో ఆగస్టు 15 నుంచి 22 వరకు ఉచిత వైద్య పరీక్షలు . అలాగే 75 ఏళ్లలోపు వారికి రూ.750లతో వైద్య పరీక్షల ప్యాకేజీ అమలు చేస్తారు.

# బిజెపిని నిలదీయాల్సిందే: లక్ష్మారెడ్డి

(మొదటి పేజి తరువాయి) ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాలు బంద్ అవుతాయని, ప్రజలందరూ గమనించాలని సూచించారు. ఓ వైపు ఉచితాలు వద్దంటూనే, ప్రపంచంలోనే అత్యంత ధనవంతులలో 4వ స్థానానికి ఎదిగేలా అదానికి మద్దతు పలుకుతారని ఎద్దేవా చేశారు. మేక్ ఇన్ ఇండియా అంటూనే జాతీయ పతాకాల తయారీకి చైనాకు ఆర్డర్ ఇచ్చిన ఘనత వారిదేనని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు, అనంతరం జరిగిన అభివృద్ధిపై ప్రజల్లో చర్చ జరగాలని కోరారు.

# జీవో 121 అమలు నిలిపివేత

(మొదటి పేజి తరువాయి) విధుల్లో చేరారంటూ ప్రభుత్వం హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వీఆర్వో సంఘాల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, కో చైర్మన్ జే రవి నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్వోల ఉద్యోగ భద్రత అంశాన్ని తేల్చకుండానే వెంటనే ఇతర శాఖల్లో చేరాలంటూ కలెక్టర్లు, అడిషన్ కలెక్టర్లు, తహసీల్దార్ల ద్వారా సీఎస్ సోమేశ్ కుమార్ తమపై ఒత్తిడి పెంచారని ఆరోపించారు.

# బిజెపి దూకుడును కెసిఆర్ ఎలా ఎదుర్కొంటారు

(మొదటి పేజి తరువాయి) ఎన్నిక ద్వారా చెక్ పెట్టాలని బీజేపీ నాయకత్వం వ్యూహం పన్నింది. అయితే దీనికి కెసిఆర్ కూడా ప్రతివ్యూహం పన్నే అవకాశం లేకపోలేదు. ఉప ఎన్నికరాజగోపాల్ రెడ్డి రాజీనామాను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆమోదించారు. దీంతో ఉనప ఎన్నిక అనివార్యం అయ్యింది. ఇకపోతే తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వస్తాయని అంటున్నారు. నాలుగేళ్ల కాలం పూర్తయ్యాక ఏ క్షణంలో అయినా కెసిఆర్ ముందస్తు ప్రకటన చేయవచ్చన్న చర్చ కూడా సాగు తోంది. ఇటీవల మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇలాంటి వార్తనే చెప్పారు. ఎప్పుడయినా ఎన్నికల బాంబ్ పేలవచ్చన్న సమాచారం ఇచ్చారు. ఇప్పుడున్న పరిస్థితులలో మునుగోడులో అధికార పార్టీ గెలిచినా, ఓడిపోయినా కేసీఆర్‌కు ఒరిగేదేమీ లేదు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత రాజకీయాలను కెసిఆర్ ఎలా ఎదుర్కొంటారా అన్నది చర్చగా మారింది. అన్నిరాష్ట్రాలకూ విస్తరించాలన్నది నరేంద్ర మోదీ, అమిత్ షాల ప్లాన్. ఇదే క్రమంలో ప్రధాని మోదీకి చెక్ పెట్టాలని కెసిఆర్ కూడా ప్లాన్ వేస్తున్నారు. ఒకప్పుడు మోదీకంటే బలంగా ఉన్న ఇందిరాగాంధీని అందరూ కలిసి ఓడించగా ఇప్పుడు అలా చేయలేమా అన్న ఆలోచనలో ఉన్నారు. మరోవైపు బెంగాల్లో పార్థా ఛటర్జీ తరహాలో ఈడీ దాడుల గురించి చర్చ సాగుతోంది. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్ష, నియంతృత్వ పోకడలకు పాల్పడుతున్నప్పటికీ ఆయనను ఎదిరించే సాహసానికి ఎంత మంది ముందుకు వస్తారన్నదే ప్రశ్న. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు. జాతీయ రాజకీయాల సంగతి ఏమోగానీ, మునుగోడు రూపంలో కేసీఆర్‌కు ఇప్పుడు స్వరాష్ట్రంలోనే బీజేపీ సవాలు విసిరింది. దీనిని ఎలా ఎదుర్కొంటారన్నదిముఖ్యం లేకుంటే ఉప ఎన్నికలో పోటీ చేయకపోవడమో లేదా చేసినా ..ఓడిపోతే అది తమసీటు కాదనే భావనతో సరిపెట్టు కోవడమే చేయవచ్చు. కెసిఆర్ కూడా వ్యూహాలు బాగానే పన్నుతారు. అందువల్ల మునుగోడును ఓ సమస్యగానే చూస్తారు తప్ప..సంక్షోభంగా చూడారని భావించాలి. ఇపోతే నిజానికి మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టున్నా.. అదంతా కోమటిరెడ్డి బ్రదర్స్ వల్ల వచ్చిందే తప్ప మరోటికాదు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా తర్వాత పరిస్థితి ఎలా మారుతుందో తెలియదు. బీజేపీ నుంచి ఎదురైన సవాల్‌ను ఎదుర్కొనే విషయంలో ఐక్యంగా పోరాడాల్సిన కాంగ్రెస్ నాయకులు అంతర్గత కుమ్ములాటలతో బిజీగా ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసేందుకు ఒరిజనల్ కాంగ్రెస్ నేతలంతా ఒక్కటవుతున్నారు. అందుకే రేవంత్ భవిష్యత్ కూడా మునుగోడు ఉప ఎన్నికతో ముడిపడి ఉంది. వలసలను ప్రోత్సహించడం ద్వారా కాంగ్రెస్‌ను ముందుగా బలహీనపరచి మునుగోడు గెలుచుకుని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలని బీజేపీ అగ్ర నాయకత్వం దూకుడు పెంచిది.

# మునుగోడులో రాజగోపాల్ రెడ్డి మునగడం ఖాయం



(మొదటి పేజి తరువాయి) సెక్యులర్ రాష్ట్రంలో సెక్యులరిజం కేసీఅర్ తోనే సాధ్యం అని పేర్కొన్నారు. రేవంత్ పై దాసోజు శ్రావణ్ వ్యాఖ్యలు వాస్తవికంగా ఉన్నాయి. చాలా రాష్ట్రాలలో ప్రజలకు తినడానికి సరైన తిండి లేదు. అది వదిలి ఇతర అంశాల మీద పీఎం మోదీ దృష్టి పెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే వివిధ రాష్ట్రాలలో ఉప ఎన్నికలు తెచ్చి రాజకీయ అనైతిక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు.

# కోమటి రెడ్డి బ్రదర్స్‌ను రెచ్చగొడుతున్న రేవంత్

(మొదటి పేజి తరువాయి) సోనియాగాంధీ దగ్గరే తేల్చుకుంటానని అన్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా తన ఎంపీ నియోజకవర్గం లోని ఓ నాయకుడిని, అది కూడా తనకు వ్యతిరేకంగా పని చేసిన నేతను ఎలా పార్టీలో చేర్చుకుంటారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. దీంతో వెంకట్‌రెడ్డి వికెట్ కూడా బిజెపి ఖాతాలో పడుతుందని అంటున్నారు. భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం పన్నిన వ్యూహంలో భాగంగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రాబోతోంది. మునుగోడు ఉప ఎన్నికలో మునిగేదెవరు అన్నది తెలంగాణలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సాధారణ ఎన్నికలకు మరో పదహారు నెలల సమయం ఉంది. ఇప్పుడు మునుగోడుకు ఉప ఎన్నిక జరిగినా అందుకు కనీసం మూడు నెలల వ్యవధి పడుతుంది. అంటే ఉప ఎన్నికలో గెలిచేవారు ఏడాది మాత్రమే ఎమ్మెల్యేగా ఉంటారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారానికి మునుగోడు ఉప ఎన్నికతో ముందుగానే చెక్ పెట్టాలని బిజెపి పెద్దలు పట్టుదలగా ఉన్నట్లు తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోంది. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రస్తుతం మునుగోడు కు ప్రాతినిధ్యం వహిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో రాజీనామా చేయించారు. రాజగోపాల్ మాత్రం నియోజకవర్గం అభివృద్ధి కోసం ఉప ఎన్నికకు వీలుగా రాజీనామా చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఆయన బీజేపీ తరఫున పోటీ చేసి గెలిస్తే అది అధికార టిఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకికూడా సవాల్ కానుంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మార్పులు వస్తాయి. బిజెపి కూడా ఇదే కోరుకుంటోంది. బిజెపి వ్యూహంలో భాగంగా ముందుగా కాంగ్రెస్ పార్టీని బలహీనపరచి మునుగోడును గెలుచుకోవడం ద్వారా ఆ తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితిని దెబ్బ తీయాల న్నది బీజేపీ పెద్దల అసలు వ్యూహంగా కనిపిస్తోంది. మునుగోడులో జెండా ఎగురవేయగలిగితే ఎన్నికల నాటికి కాంగ్రెస్, టీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి భారీగా వలసలు పెరుగుతాయి. దీంతో టిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడుతుంది. నరేంద్ర మోదీ, అమిత్ షాల వ్యూహం కూడా ఇదే. ఇదిలా ఉంటే ఈ నెల 21న మునుగోడులో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభకు అమిత్ షా హాజరవుతారు. అప్పుడే తాను బీజేపీలో చేరతానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. దీంతో 21 నాటికి తెలంగాణ కాంగ్రెస్‌లో పరిణామాలు ఏ రకంగా మారతాయో అనే చర్చ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. రాబోయే రోజుల్లో తన సోదరుడు వెంకట్ రెడ్డి కూడా మంచి నిర్ణయం తీసుకోవాలని తాము అనుకుంటున్నామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరడానికి మరో పదిరోజుల సమయం ఉంది. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరింతగా రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇక కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారని.. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీసుకుంటున్న పలు నిర్ణయాల పట్ల అసహనంగా ఉన్నారని చర్చ మొదలైంది. ఈ వ్యాఖ్యలను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఖండిస్తున్నా.. తాను పార్టీని వీడితే.. అందరికీ చెప్పే వెళతానని అంటున్నా..వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే వారు ఏ మేరకు కాంగ్రెస్‌కు డ్యామేజ్ చేస్తారన్నదే ముఖ్యం.

# ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

(మొదటి పేజి తరువాయి) తేదీ వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని చెప్పారు. ఆనాడు దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి పోరాడిన మహానుభావుల జీవిత చరిత్రను తెలియజేసే ఛాయాచిత్రాల ప్రదర్శనను మ్యూజియంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఎగ్జిబిషన్‌ను ఒక్కసారైనా తిలకించాలని అన్నారు. మానవీయ విలువలన్నింటిలో త్యాగనిరతి గొప్పదని మొహర్రం చాటిచెబుతుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు.నిజవిశ్వాసం కోసం ప్రాణత్యాగం చేసిన ముహమ్మద్ ప్రవక్త మునిమనవడు హజ్రత్ ఇమామ్ హుసేన్‌ను స్మరిస్తూ మొహర్రం జరుపుకుంటారని తెలిపారు. ఇస్లాంకు మూలసిద్ధాంతమైన మూర్తీభవించిన మానవతావాదాన్ని అనుసరించాలనే సందేశాన్ని మొహర్రం ఇస్తుందన్నారు. దయ, కరుణ, శాంతి, న్యాయాన్ని పాటించాలన్న స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డి, పీఐబీ అండ్ సీబీసీ డైరెక్టర్ శ్రుతి పాటిల్, పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'లవ్ సాలార్‌జంగ్ మ్యూజియం'అనే బోర్డు వద్ద నిల్చుని సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం సాలార్‌జంగ్ భవన ప్రాంగణం వచ్చేలా కూడా తన సెల్ ఫోన్‌లో సెల్ఫీ తీసుకున్నారు.

# తెలంగాణలో వ్యాక్సిన్ల కొరత



తక్షణమే 50లక్షల వ్యాక్సిన్‌లు పంపండి
కేంద్రమంత్రికి మంత్రి హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** కొవిడ్ టీకాల సరఫరా పెంచాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కోవిషీల్డ్ డోసులు కేవలం 2.7 లక్షలు మాత్రమే ఉన్నాయని, ఇవి రెండు రోజులకు సరిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ మేరకు మంగళవారం హరీశ్‌రావుకు కేంద్రమంత్రికి లేఖ రాశారు. కొవిడ్ వ్యాక్సినేషన్ విషయంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని, ఫస్ట్ డోస్ వ్యాక్సినేషన్ విషయంలో తెలంగాణ 106శాతం సాధించిందని, రెండో డోస్ వ్యాక్సినేషన్‌లో 104శాతం సాధించామన్నారు. 18 ఏండ్ల వయసు పైబడిన వారికి వాక్సినేషన్‌లోనూ దేశంలోనే తొలి స్థానంలో తెలంగాణ నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రికాషనరీ డోస్ విషయంలో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో డిమాండ్ మేరకు ప్రతీ రోజు 3 లక్షల డోస్‌లు ఇవ్వగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ.. వాక్సిన్ కొరతతో రోజుకు కేవలం 1.5 లక్షల డోస్‌లు మాత్రమే ఇవ్వగలుగుతున్నామన్నారు. ప్రస్తుత డిమాండ్ మేరకు మాకు వాక్సిన్ సరఫరా కావడం లేదని, రాష్ట్రంలోని డిమాండ్ మేరకు కేంద్ర ప్రభుత్వం వాక్సిన్ సరఫరా ఎప్పటికప్పుడు పెంచాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోవిషీల్డ్ డోస్‌లు కేవలం 2.7 లక్షలు మాత్రమే ఉన్నాయని, వెంటనే 50 లక్షల కోవిషీల్డ్ డోస్ వాక్సిన్ రాష్ట్రానికి పంపాలని కోరారు.

# స్వతంత్ర భారత వజ్రోత్సవాల ఏర్పాట్లు ముమ్మరం


నేటినుంచి ఇంటింటికి జాతీయ జెండాల పంపిణీ



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** స్వతంత్ర భారత వజ్రోత్సవాల ఏర్పాట్లను జీహెచ్ఎంసీ ముమ్మరం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మంగళవారం ఇంటింటికి జాతీయ పతాకాన్ని పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రతి కుటుంబం వజ్రోత్సవాలు ముగిసేవరకు తమ ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. నియమావళి అనుసరించి పతాకావిష్కరణ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జెండా ఆవిష్కరించినా, అవమానించడం, అగౌరవపరచడం వంటి ఘటనలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ డి.ఎస్.లోకేష్‌కుమార్ హెచ్చరించారు.80 పార్కుల్లో ప్రత్యేక ఏర్పాట్లు.. జీహెచ్ఎంసీ పార్కుల విభాగం నగరంలోని 75 పార్కులను ఫ్రీడం పార్కులుగా ప్రకటించి, ప్రవేశ ద్వారాలకు, బల్లలకు, వృక్షాల మొదళ్లకు మువ్వన్నెల రంగులు వేస్తోంది. బుధవారం ఎంపిక చేసిన పార్కుల్లో మొక్కలు నాటనుంది. మరో ఐదు పార్కుల్లోనూ ఏర్పాట్లు చేయనున్నామంది. కాలిబాటల పొడవునా విద్యుద్దీపాలు, స్వతంత్రోద్యమ గేయాలు వినిపించేటట్లు స్పీకర్లు ఏర్పాటు చేయనుంది. అందరిలో దేశభక్తి పెంపొందించేలా స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో పోలీసులు భాగస్వాములు కావాలని నగర సీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. సోమవారం సీపీ నగరంలోని డీసీపీ, ఏసీపీ, ఎస్‌హెచ్‌వోలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ ఆపి జాతీయగీతం ఆలపించేలా చర్యలు, ప్రతి ఠాణా పరిధిలో విద్యార్థులకు ఆటలపోటీలు తదితర కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి.

# బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష

ఖేలో ఇండియా స్కీం అమల్లో అన్యాయం
తెలంగాణకు నామమాత్రపు కేటాయింపులు
మరోసారి కేంద్రంపై కేటీఆర్ మండిపాటు



**హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** సోషల్ మీడియాలో చురుకుగా ఉంటే టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి కేంద్రంపై మండిపడ్డారు. సందర్భాన్ని బట్టి కేంద్రంపై విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు కేటీఆర్ సంధిస్తుంటారు. అయితే ఈసారి మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేశారు. ఖేలో ఇండియా స్కీం అమలు కోసం కేంద్రం చేసిన కేటాయింపులపై మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ ట్వీట్ చేశారు. బీజేపీయేతర రాష్ట్రాల పట్ల తీవ్ర అన్యాయం చూపిందన్నారు. తెలంగాణకు రూ. 24. 11, ఏపీకి రూ. 33.80 కోట్లు విడుదల చేయగా, గుజరాత్‌కు రూ. 608.37 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ. 503.02 కోట్లు, కర్ణాటకకు రూ. 128.52 కోట్లు విడుదల చేసినట్లు నాగేశ్వర్ పేర్కొన్నారు. మరోవైపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణలోని ఆదివాసీల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో నిర్మించిన కుమ్రం భీం ఆదివాసీ భవన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. గూడెంలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది ఆదివాసీల కళను సీఎం కేసీఆర్ తీర్చారని పేర్కొన్నారు. జోడేఘాట్‌లో కుమ్రం భీం మ్యూజియంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం జిల్లా అని నామకరణం చేశామన్నారు.

# బీహార్ సీఎంగా నితీష్ రాజీనామా

గవర్నర్ ఫాగు చౌహాన్ కు రాజీనామా లేఖ

ఆర్జేడీ, కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు దిశగా అడుగులు

160 ఎమ్మెల్యేల మద్దతు ఉందంటున్న నితీష్



**బీహార్, ఆగస్ట్ 9 (సమ సమాజం):** బీహార్లో అనుకుంటున్నదే జరిగింది. బీజేపీ-జేడీయూ కూటమి మధ్య విభేదాలు తీవ్రతరం కావడంతో.. బీజేపీని వదిలించుకోవాలని డిసైడైన జేడీయూ నేత, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన సీఎం పదవికి రాజీనామా చేశారు. బీహార్ గవర్నర్ ఫాగు చౌహాన్‌ను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. అదే సమయంలో ఆర్జేడీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతుతో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన నితీష్.. తనకు 160 ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ గవర్నర్‌కు మరో లేఖ ఇచ్చారు. ఎన్డీయే నుంచి విడిపోయిన తర్వాత మహాకూటమితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నితీష్ కుమార్ నిర్ణయించుకున్నారు. అంతకుముందు జరిగిన మహాకూటమి సమావేశంలో నితీష్ కుమార్‌కు మద్దతు లభించినందున, సిఎం నితీష్ కుమార్ ఎన్డీయే నుండి విడిపోతారని ఊహాగానాలు వచ్చాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశం అనంతరం అధికారికంగా ప్రకటించనప్పటికీ ఎన్డీయే నుంచి విడిపోవాలని జేడీయూ నిర్ణయించింది. ఈ ఘటన తర్వాత నితీష్ కుమార్ రాజీనామా చేసేందుకు గవర్నర్ ఫాగు చౌహాన్ వద్దకు చేరుకున్నారు. నితీష్ కుమార్ తన రాజీనామాను ఎప్పుడైనా గవర్నర్‌కు సమర్పించవచ్చని చెప్పబడింది, అయితే చివరికి సాయంత్రం 4 గంటల సమయంలో ఆయనను కలవడానికి గవర్నర్ సమయం ఇచ్చారు. రాజీనామా చేసేందుకు నితీష్ కుమార్ ఒంటరిగా రాజ్ భవన్ చేరుకున్నారు. ఆయన రాజీనామా సమర్పించడంతో బీహార్లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. బీహార్లో కొత్త అధికార సమీకరణం ప్రకారం జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి. 160 మంది ఎమ్మెల్యేల (ఆర్జేడీ-79, జేడీయూ-45, కాంగ్రెస్-19, లెఫ్ట్-16, ఇండిపెండెంట్-1) మద్దతు లేఖతో నితీశ్ కుమార్ రాజ్‌భవన్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. ఇప్పుడు బీహార్లో నితీష్ కుమార్, తేజస్వి యాదవ్ కొత్త ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారనే దానిపై అందరి దృష్టి ఉంది. అయితే బీహార్లో ఈ రకమైన పరిణామాలు చోటు చేసుకోవడం కొత్తేమీ కాదు. ఐదేళ్ల క్రితం 2017లో పరిస్థితి అలాగే ఉంది. 2017లో నితీష్ కుమార్ మహాకూటమిలో భాగమయ్యారు. ఆయనే ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ప్రభుత్వంలో తేజస్వీ యాదవ్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు. తేజస్వి యాదవ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఒకరోజు నితీష్ కుమార్ హఠాత్తుగా రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పించారు. దీంతో మంత్రివర్గం ఆటోమేటిక్‌గా రద్దయింది. నితీష్ కుమార్ తీసుకున్న ఈ నిర్ణయం సంచలనం కలిగించింది. రెండేళ్లలోనే మహాకూటమి ప్రభుత్వం పడిపోయింది. మహాకూటమి నుంచి తెగతెంపులు చేసుకున్న నితీష్ కుమార్ బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రభుత్వం పదవీకాలం కూడా పూర్తి చేసుకుంది. ఇప్పుడు మరోసారి రాష్ట్రంలో అదే పరిస్థితి నెలకొంది. అయితే పోయినసారి తేజస్విపై అవినీతి ఆరోపణలే కారణం కాగా, ఈసారి బీజేపీ జేడీయూను దెబ్బతీసే అంశం తెరపైకి వచ్చింది. నితీష్ కుమార్‌ను సీఎం చేయాలంటూ ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఫ్రంట్ ఎమ్మెల్యేలు తేజస్వి యాదవ్‌కు మద్దతు లేఖ అందించారని సమాచారం. ఈ నేపథ్యంలోనే నితీష్ కుమార్ రాజ్‌భవన్‌కు వెళ్లి మహాకూటమికి చెందిన పార్టీలు ఇచ్చిన మద్దతు లేఖను గవర్నర్ ఫాగు చౌహాన్‌కు అందజేశారని తెలుస్తోంది.

# మునుగోడు సభతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

(మొదటి పేజి తరువాయి)వ్యూహ, ప్రచార కమిటీ నియోజకవర్గంలో మకాం వేయనుంది. దీంతో రోజురోజుకూ ఉప ఎన్నిక వేడి పెరుగుతోంది. టీఆర్ఎస్ సైలెంట్ ఆపరేషన్‌రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేసి ఉప ఎన్నిక తెస్తాడ న్న సమాచారం అధికార టీఆర్ఎ?సకు ఆరునెలల ముందునుంచే ఉంది. ఈ క్రమంలోనే ఆయన కదలికలపై టీఆర్ఎస్ నిఘా పెట్టింది. హుజూరాబాద్‌లో హడావుడి చేసి బోర్లాపడ్డ అనుభవంతో స్థానికంగా ఆచితూచి అడుగులు వేస్తోంది. మంత్రి జగదీష్‌రెడ్డి మూడు నెలలగా ఈ ఏర్పాట్లు గుంభనంగా చేసుకుంటూ వస్తున్నారు. నేడో, రేపో తెరవెనుక టీఆర్ఎస్ చేసిన ప్రయత్నాలు బహిరంగం కానున్నాయి. 21న చౌటుప్పల్‌లో బీజేపీ సభఅనుకున్నట్టుగానే ఈ నెల మొదటివారంలోనే రాజీనామా ప్రకటన చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఉప ఎన్నికకు సంబంధించి చకచకా పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు డైలమాలో ఉండటం, కాంగ్రెస్ శ్రేణులు గంపగుత్తగా వస్తాయా అనే సందేహాల నేపథ్యంలో ముందుకు వెళ్లేందుకే రాజగోపాల్‌రెడ్డి నిశ్చయించుకున్నారు. అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాలతో భేటీ అయి, ఈనెల 21న చేరికకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. చౌటుప్పల్‌లో 3లక్షల మందితో సభ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల నుంచి భారీగా చేరికలు ఉండనున్నాయి. మునుగోడులో పట్టునిలుపుకునేందుకు శుక్రవారం తనకు సూర్యాపేట ఎంతో మునుగోడు అంతే అంటూ స్థానికంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వ్యవహారాన్ని మంత్రి జగదీష్రెడ్డి తన చేతిలోకి తీసుకున్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, దళితబంధు పథకం ప్రచారం వంటి కార్యక్రమాలకు స్వయంగా మంత్రి హాజరయ్యారు. మరో వైపు నియోజకవర్గంలో ఉన్న గ్రూపు తగాదాలను దారికి తెచ్చేందుకు పని ప్రా రంభించారు. అన్ని మండలాల అధ్యక్షులు, కీలక ప్రజాప్రతినిధులతో మంత్రి నేరుగా సంబంధాలు ఏర్పరుచుకొని కాం గ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో వలసలను ప్రోత్సహించారు. ఒక వైపు ప్రభుత్వ యంత్రాంగం, మరో వైపు పార్టీ వ్యవ స్థ తన నియంత్రణలోకి వచ్చేలా పనిచేశారు. అక్కడ పేరుకే కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినా, వ్యవహారమంతా అధికార టీఆర్ఎస్దే అన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. రాజగోపాల్ రాజీనామా ఖరారైనా, ఇప్పటి వరకు టీఆర్ఎస్ నుంచి ఎలాంటి ప్రకటనలు లేకుండా వ్యూహాత్మక మౌనం పాటించారు. ఓవైపు పార్టీ, ఇతర పార్టీల బలాబలాలు, అభ్యర్థి ఎవరైతే మంచిది, ఎదుటి అభ్యర్థులు ఎవ రు, వారి బలాలు, బలహీనతలపై సర్వేలు, ఎ÷-లాష్ సర్వేలు చేసుకుంటూ గట్టుప్పల్ మండల ప్రకటన చేసి సైలెంట్ గా ఉన్నారు. కొన్ని నెలలుగా మంత్రి జగదీష్రెడ్డి చేసిన ప్రయత్నాలు నేడో, రేపో బహిర్గతం కానున్నట్టు తెలిసింది.

## మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భక్వాస్ త్యాగాలు

(మొదటి పేజి తరువాయి)ఓట్లు కమ్యూనిస్టు ఓట్లు ఉండగా, టీడీపీ ఓట్లు దాదాపు 7,000ల వరకు ఉన్నాయి. ఈ ఓట్లు అన్ని ప్రజాకూటమి అభ్యర్థిగా నిలబడిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఓట్లు వేశారు. తనను నమ్మి వేసిన ఓటర్లకు న్యాయం చేయలేకపోవడంతో ప్రజలు ఆలోచనలో పడినట్లు తెలుస్తుంది. కమ్యూనిస్టు పార్టీ నుంచి ఉపఎన్నికల బరిలో అభ్యర్థిని నిలబెట్టితే ఓట్లు చీలి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపుకు అనుకూలంగా మారే ఛాన్స్ ఏర్పడుతుంది. దీనితో ప్రజాకూటమి ద్వారా చేసిన తప్పిదంను పూడ్చుకోవడానికి కమ్యూనిస్టులు చరిత్రహీనులుగా మిగులుతారో లేదా టీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు సపోర్టు చేస్తారో లేదో చూడాలి. ఉపఎన్నికలో కమ్యూనిస్టులు అభ్యర్థిని నిలబెట్టుకోవడం వల్ల ఉపయోగం లేదు. అభ్యర్థిని నిలబెట్టి బల నిరూపన చేసుకోవడం సరైన సమయం కాదు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటం వల్ల ఈ ఎన్నికలు సెమీఫైనల్‌గా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల భవితవ్యంకు ఈ ఎన్నికలు తీర్పుకు దోహదపడుతాయి. ఇదిలా ఉంటే మునుగోడు ప్రజలకోసం పదవిని త్యాగం చేశానని చెప్పుకుంటున్న బక్వాస్ లీడర్ రాజగోపాల్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పాలను కుంటున్నారు. రాజగోపాల్‌రెడ్డికి ఉపఎన్నిక జీవన్మరణ సమస్యగా మారింది. అలాగే కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు కూడా మునుగోడు ఉపఎన్నిక జీవన్మరణ సమస్యగా మారే అవకాశం ఉంది.

## నన్ను చంపేస్తారు.. డేట్ రాసి పెట్టుకోండి

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్ట్ 9 (సమ సమాజం):'డేట్ రాసి పెట్టుకోండి.. నన్ను వందకు వంద శాతం చంపేస్తారు' అంటూ బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మం గురించి మాట్లాడుతున్న తనపై ఇవాళ కాకపోయినా రేపు బుల్లెట్లను ఉపయోగిస్తారని.. ఈ విషయం తనక్కూడా తెలుసని కుండబద్దలు కొట్టారు.

# రక్షా బంధన్ సందర్భంగా ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9 (సమ సమాజం):** రక్షా బంధన్ సందర్భంగా ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ ఇప్పటికే పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని రైల్వే ప్రయాణీకులకు లబ్ధి చేకూరేలా మరికొన్ని మార్గాల్లో ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య రెండు సర్వీసుల ప్రత్యేక రైళ్లను నడప నున్నారు. ఆగస్టు 12న సాయంత్రం 05.50 గం.లకు ప్రత్యేక రైలు (నెం.07473) సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.20 గం.లకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకోనుంది. అలాగే ఆగస్టు 13న సాయంత్రం 07.30 గం.లకు ప్రత్యేక రైలు (నెం.07474) తిరుపతి నుండి బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 09.10 గం.లకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు రెండు మార్గాల్లోనూ జనగామ, కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. అలాగే సికింద్రాబాద్ - యస్వంత్‌పూర్ మధ్య రెండు సర్వీసుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ద.మ.రైల్వే ప్రకటించింది. ఆగస్టు 10 తేదీన రాత్రి 09.45 గం.లకు ప్రత్యేక రైలు (07233) సికింద్రాబాద్ నుండి బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 10.50 గం.లకు యస్వంత్‌పూర్‌కు చేరుకుంటుంది. ఎదురు దిశలో ఆగస్టు 11 తేదీన మధ్యాహ్నం 03.50 గం.లకు ప్రత్యేక రైలు (నెం.07234) యస్వంత్‌పూర్ నుంచి బయలుదేరి.. మరుసటి రోజు వేకువజామున 04.15 గం.లకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, అనంతపూర్, ధర్మవరం, హిందూపూర్, యెలహంక రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లలో జనరల్ క్లాస్, స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లు ఉంటాయని ద.మ.రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# స్వాతంత్ర సమరయోధుడికి ప్రభుత్వం సన్మానం



**అందోల్,ఆగస్టు 09 (సమ సమాజం):** స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని భారత రాష్ట్ర ప్రభుత్వాల తరఫున మంగళవారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ లు జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర సమరయోధులు తామర పత్ర గ్రహీత లింగయ్య గౌడ్ ని ప్రభుత్వం పంపించిన శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించారు. అనంతరం స్వతంత్ర సమరయోధులు లింగయ్య గౌడ్ ఆనాటి ఉద్యమ పోరాట అనుభవాలను వారితో పంచుకున్నారు. ఆ దృశ్యాలు నేటికీ కళ్ళ ముందు కదలాడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వీరి పోరాటం వల్లే మనం ఈరోజు భారతదేశంలో స్వతంత్రంగా జీవిస్తున్నామని. అలాంటి పోరాటయోధులందరిని గుర్తుంచుకోవడం మన బాధ్యత అన్నారు. ఈయన ఆ భగవంతుని దయతో నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సంగారెడ్డి డి. ఎస్. పి రవీంద్ర రెడ్డి, జోగిపేట ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసిల్దార్ అరుణోదయ చారి, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు చందర్ నాయక్, ప్రవీణ్ కుమార్, తెరాస నాయకులు పులుగు గోపాల్, పడిగె సత్యం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం జలాశయం 6గేట్లు ఎత్తివేత



**శ్రీశైలం, ఆగస్ట్ 9 (సమ సమాజం):** కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో జలాశయం ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల నుంచి ప్రాజెక్టుకు 1,73,695 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 884.85 అడుగుల నీరుంది. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 214.36 టీఎంసీల నీరు ప్రాజెక్టులో ఉంది. స్పిల్ వే ద్వారా సాగర్‌కు 1,73,695 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్‌కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 63,046 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఆరుగేట్లు ఎత్తడంతో శ్రీశైలం ఆలయానికి వచ్చిన భక్తులు జలాశయం అందాలను తిలకిస్తున్నారు.

# ఘనంగా మొహరం వేడుకలు



**అందోల్,ఆగస్టు 09 (సమ సమాజం):** మహమ్మదీయుల ప్రధాన పర్వ దినాలలో మొహరం ముఖ్యమైనది. హసన్, హుస్సేన్ అనే ముస్లిం వీరుల స్మారకార్థం శోక తప్త హృదయాలతో జరుపు కునే కార్యక్రమమే పీర్ల పండుగ మొహర్రం. ముస్లిం పంచాంగ రీత్యా అరేబియాలో సంవత్సరం యొక్క మొదటి నెల మొహరం. మొహరం నెల మొదటి తేదీ నుండి పదవ తేదీ వరకు జరుపుకునేవారు. మొహరం పండుగనే "పీర్ల పండుగ " అని కూడా అంటారు. పీర్ అంటే మహాత్ములు, ధర్మనిర్దేశకులు అని అర్థం. ధర్మ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ప్రతీకగా హస్తాకృతి కలిగిన రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి, ఊరేగించి, పూజించే వాటిని పీర్లు అని పిలుస్తారు. ఇస్లాం పునర్జీవానికి ప్రాణం పోసిన ఆ అమరుల త్యాగాన్ని స్మరించడమే మొహారం. అందుకే 'మోహరం' పండుగ కాదు.మహ్మద్ ప్రవక్త కుటుంబం చేసిన త్యాగాల్ని స్మరించడం. తెలుగు ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం నాటి నుండి వస్తున్న ఆచారం. మంగళవారం కొనసాగనున్న ఈ పండుగను జిల్లాల వ్యాప్తంగా జోగిపేట, వటపల్లి, టేక్మాల్,అల్లాదుర్గ్, మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ఈ మొహరం పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పీర్ల పండగ అంటే గుర్తొచ్చేది డాకూర్ గ్రామం. ఈ పండుగకి ఆడపడుచులు బంధువులు దూరప్రాంతాల నుండి ఈ వేడుకలను చూడడానికి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ పీర్లని దర్శించుకుని మొక్కలు మొక్కితే నెరవేరుతాయనే నమ్మకం భక్తులది. ఈ రోజు మొహరంపండగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాలలో పీర్లను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంకాలం వరకు పీర్ల ఊరేగింపు ఉత్సవాలు. మతాలకతీతంగా ప్రజలంతా దూల ఆటలు సంబురంగా జరుపుకోనున్నారు.

# మత సామరస్యానికి.. వీరోచిత త్యాగానికి ప్రతీక మొహర్రం



యౌమే ఆశురా సందర్భంగా ఎంఐఎం ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి గంగుల

**కరీంనగర్, ఆగస్టు 9 (సమ సమాజం):** మొహర్రం 10వ తేదీ యౌమే ఆశురా సందర్భంగా నగరంలోని పాత బజార్, జామా మసీదు ప్రాంగణంలో ఎంఐఎం పార్టీ కరీంనగర్ జిల్లా ఇన్చార్జ్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర బిసి, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరై పాలతో కూడిన షర్బత్ను పంపిణీ చేశారు. అనంతరం పిరీలను దర్శించుకున్నారు. వచ్చే ఏడాది నుంచి పిరీలను కరీంనగర్ నగర వ్యాప్తంగా ఊరేగించాలని నిర్వాహకులకు..ఎంఐఎం నాయకులకు సూచించారు. మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని, హిందూ ముస్లింల ఐక్యతకు చిహ్నమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ మాట్లాడుతూ హజరత్ ఇమామ్ హుస్సేన్ వీరోచిత త్యాగానికి ప్రతీకగా మొహర్రం అన్నారు. త్యాగ ధనుల వీరోచిత పోరాటానికి గుర్తింపుగా ప్రతియేటా పవిత్ర మొహర్రం నెల 10వ తేదీనీ స్మృతి దినంగా జరుపుకుంటారన్నారు. ఎంఐఎం జిల్లా ఇంచార్జి గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పవిత్ర పుణ్య ఫలాలను పొందడానికి ప్రతి ఏటా 10వ మొహర్రం రోజున సందర్భంగా షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, ఎసిపి విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నాయకులు సయ్యద్ బర్కత్ అలీ, అజర్ దబీర్, ఖమరుద్దీన్ కాజమలి ఖాన్, టిఆర్ఎస్ నాయకులు కోఅప్షన్ సభ్యుడు అంజద్ అలీ, కర్ర సూర్యశేఖర్, పొన్నం అనిల్ గౌడ్, నవాజ్, షౌకత్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు

# అమరుల త్యాగాలు మరువలేనివి: ఎమ్మెల్యే క్రాంతి



**ఆందోల్,ఆగస్టు 09 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాలను అనుసరించి స్వతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకలలో భాగంగా మంగళవారం ఆందోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఎంపీ బీబీ పాటిల్ లు జోగిపేట పట్టణంలోని మద్యరంగం వద్ద ఇంటింటికి జాతీయ జెండా పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటారు. వందేమాతరం అనే నినాదాలతో ప్రజలను చైతన్యం చేశారు.ఈ సందర్భంగా ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, బిబి పాటిల్ లు మాట్లాడుతూ. భారతదేశాన్ని బ్రిటిష్ వాళ్ళ సంకెళ్ల నుండి విముక్తి చేసి ప్రాణాలను అర్పించిన అమరులని గుర్తు చేశారు. ఆ ఉద్యమంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి మనకు స్వాతంత్రంతెచ్చిన అమరులైన వారందరికీ మనందరం నివాళులర్పించాలన్నారు. వారి త్యాగాలను వాడ వాడ ప్రతి ఇంటింటికి జెండా ఎగరవేసి వేలాదిమంది అమరులైన వారందరినీ స్మరించుకోవాలన్నారు. ఈతరం వారందరూ స్వతంత్ర ఉద్యమం ఎందుకు జరిగింది. బ్రిటిష్ వాళ్లు మన దేశానికి వచ్చి భారతదేశ ప్రజలకు ఎందుకు అణచివేతకు గురి చేశారు అనే చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనల్ని బానిసలుగా చేసి గొంతు నొక్కారన్నారు. మన స్వతంత్రం కోసం ఎందరో మహానుభావులు కొట్లాడు ప్రాణాలను అర్పించి బానిస సంకెళ్లు తెంపి మన దేశానికి ఊపిరి పోసారన్నారు. జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర సమరయోధులు లింగమయ్య గౌడ్ స్వతంత్ర ఉద్యమంలో పోరాడిన గత అనుభవాలను వెల్లడించారన్నారు. అప్పటి పోరాట దృశ్యాలు ఇంకా కళ్ళ ముందు కదలాడుతున్నాయని చెప్పడం జరిగిందన్నారు. ఈ వజ్రోత్సవాల సందర్భంగా స్వతంత్ర సమరయోధులు లింగమయ్య గౌడ్ గారికి జహీరాబాద్ ఎంపీ బీబీ పార్టీ ప్రభుత్వం తరఫున ప్రభుత్వం పంపిన శాలువాతో సన్మానం చేయడం జరిగిందన్నారు. అలాంటి ఎందరో మహానుభావులు మన మధ్యలో ఉన్నారని వారందరూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు హాయిగా ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతున్నీ వేడుకుందామన్నారు.




# చలన చిత్రం

## ఇన్‌స్టాగ్రామ్ పోస్టులన్నీ డిలీట్ చేశాడు



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే హీరోల్లో రానా దగ్గుబాటి ఒకరు. అలాంటి రానా ఉన్నట్లుండి ఇన్‌స్టాగ్రామ్ పోస్టులన్నీ డిలీట్ చేయడం, అది కూడా పెళ్లిరోజే పోస్టులు తొలగించడం పలు అనుమానాలకు తావిచ్చింది. పెళ్లిరోజుకు ఒకరోజు ముందే సోషల్ మీడియా బ్రేక్ కూడా ప్రకటించడంతో రానా పర్సనల్ లైఫ్‌పై నెట్టింట చర్చ మొదలైంది. భార్య మిహికాకు-రానాకు మధ్య ఏమైనా విబేధాలు తలెత్తాయన్న రూమర్స్ కూడా గుప్పుమన్నాయి. అయితే తాజాగా రానా భార్య మిహికా ఈ వార్తలకు చెక్ పెట్టింది. సెకండ్ ఆనివర్సరీ సందర్భంగా భర్తతో కలిసి దిగిన కొన్ని బ్యూటిఫుల్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో రానా-మిహికాలకు సంబంధించి నెట్టింట వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని తేలిపోయింది. ఇక మిహికా పోస్ట్ చూసి వెంకటేశ్ కూతురు ఆశ్రితతో పాటు పలువురు సెలబ్రిటీలు ఈ కపుల్స్‌కి ఆనివర్సరీ విషెస్‌ను తెలుపుతూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా 'పని జరుగుతోంది. సోషల్ మీడియా నుంచి కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను అంటూ రానా ట్వీట్ చేసి అభిమానులకు షాకిచ్చిన సంగతి తెలిసిందే.



## చాలా అవమానంగా అనిపించింది

లీవుడ్ స్టార్ హీరోల లిస్ట్ లో టాప్ 5లో ఒకరు అమీర్ ఖాన్. అక్కడ అమీర్ ఖాన్ అంటే స్పెషల్ క్రేజ్ ఉంటుంది. విభిన్నమైన సినిమాలకు పెట్టింది పేరు అమీర్ ఖాన్. అమీర్ ఖాన్ సినిమా అంటే చాలు అవలీలగా వందకోట్ల వసూల్ రాబడుతుందని నమ్మకం వ్యక్తం చేస్తుంటారు ప్రొడ్యూసర్లు. అలాగే తనదైన నటనతో సినిమాను రక్తికట్టించడంలో ఆయనకు ఆయనే సాటి. అమీర్ ఖాన్ చేసే ప్రయోగాలు మారే ఇతర హీరోలు చేయరంటే అతిశయోక్తికాదేమో.. సినిమా సినిమా గ్యాప్ తీసుకున్నా సూపర్ హిట్ మూవీస్ తో ప్రేక్షకులను అలరిస్తారు అమీర్. అయితే అమీర్ ఖాన్ ఏమి అంత సులభంగా సూపర్ స్టార్ అవ్వలేదు.. ఆయన కూడా తన జీవితంలో ఎన్నో అవమానాలు, పేదరికం అనుభవించి వచ్చిన వారే.. తాజాగా తన స్కూల్ లైఫ్ గురించి.. అప్పటి చేదు అనుభవాల గురించి ఎమోషనల్ అయ్యారు అమీర్ ఖాన్. ప్రస్తుతం అమీర్ ఖాన్ లాల్ సింగ్ చడ్డా సినిమాలో నటిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అమీర్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన చిన్నతనంలో తన కుటుంబం ఆర్థిక సమస్యలు ఎదుర్కొందని అన్నారు. స్కూల్ డేస్ లో కనీసం ఫీజు కూడా కట్టలేని పరిస్థితి ఉండేదని.. ఆ సమయంలో ఫీజ్ కట్టని వారి పేర్లు చదువుతుంటే తాను చిన్నబుచ్చుకునేవాడినని అన్నారు అమీర్. తాను చదువుకునే రోజుల్లో తమ కుటుంబం తీవ్ర అప్పుల్లో ఉండి, ఎనిమిదేళ్ల పాటు గడ్డు పరిస్థితులను చూసినట్టు తెలిపారు అమీర్. స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజ్ కట్టని వారి పేర్లు పెద్దగా చదివేవారు అని అప్పుడు చాలా అవమానంగా అనిపించేదని చెప్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు అమీర్ ఖాన్. ఇక లాల్ సింగ్ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో కరీనా కపూర్ హీరోయిన్ గా నటించగా.. అక్కినేని యంగ్ హీరో నాగచైతన్య కీలక పాత్రలో నటిస్తున్నాడు.



## నా కల నెరవేరబోతోంది

మహేశ్ బాబు, రాజమౌళి కాంబోలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే! ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో చేస్తోన్న 28 ప్రాజెక్ట్ ముగించుకున్న తర్వాత, జక్కన్నతో మహేశ్ సెట్స్ మీదకి వెళ్లనున్నాడు. అయితే, అదెప్పుడన్నది ఇంకా క్లారిటీ లేదు. బహుశా ఒక ఏడాదికి పైనే సమయం పట్టొచ్చు. అయితే.. సినీ ప్రియులు మాత్రం ఆలోపు వెయిట్ చేయలేకపోతున్నారు. ఈ సినిమా గురించి ఏదో ఒక అప్డేట్ తెలుసుకోవడం కోసం ఉబలాటపడుతున్నారు. అటు మీడియా సైతం ఏమైనా అప్డేట్స్ లీక్ అవుతాయా? అని వెయిట్ చేస్తోంది. ఈ క్రమంలోనే మహేశ్ బాబు తాజాగా జక్కన్నతో ప్రాజెక్ట్ గురించి కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. "రాజమౌళితో కలిసి పని చేయాలన్న నా కల నెరవేరబోతోంది. జక్కన్నతో ఒక సినిమా చేయడమంటే, 25 సినిమాలకు సమానం. ఈ చిత్రం కోసం నాకు శారీరకంగానూ చాలా కష్టపడాల్సి ఉంటుంది. ఇదొక పాన్ ఇండియా సినిమా. ఈ చిత్రంతో మేము హద్దులన్నీ చెరిపేసి, ప్రతి భారతీయుడికి మా పనిని చేరవేస్తాం. నిజంగా ఈ ప్రాజెక్ట్ చేస్తున్నందుకు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను" అంటూ మహేశ్ చెప్పుకొచ్చాడు. శారీరకంగా కష్టపడాల్సి వస్తుందని మహేశ్ చెప్పిన మాటల్ని బట్టి చూస్తుంటే.. అతడు మనకు కొత్త గెటప్‌లో కనిపించబోతున్నట్టు స్పష్టమవుతోంది. బాహుబలి కోసం ప్రభాస్ ఎలా బాడీని పెంచాడో, మహేశ్ కూడా అలాగే కసరత్తు చేయనున్నాడేమో చూడాలి. కాగా.. ఈ సినిమాను కేఎల్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్, జక్కన్న కలిసి ఒక ఫ్యాంటసీ కథని సిద్ధం చేస్తున్నారు. ఇండియానా జోన్స్ తరహాలో ఆఫ్రికన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను భారీ ఎత్తున తెరకెక్కించబోతున్నట్టు ఇప్పటికే విజయేంద్ర ప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అన్నీ అనుకున్నట్టు కుదిరితే.. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ సినిమా సెట్స్ మీదకి వెళ్లే అవకాశం ఉంది.



## ఏంటమ్మ మరీ టూ మచ్

రష్మిక మందన్న క్రేజ్ రోజు రోజుకు భారీగా పెరిగిపోతోంది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ చిన్నది తెలుగులో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ స్థాయిని దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగు, కన్నడ తోపాటు తమిళ్, బాలీవుడ్ లోనూ సినిమాలు చేస్తూ బిజీ హీరోయిన్ గా మారిపోయింది. మన దగ్గర బడా హీరోల సరసన నటిస్తోంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో భారీ అవకాశాలు అందుకుంటోంది. ఇప్పటికే మహేష్ బాబు సరనస సర్కారు వారి పాట.. అల్లు అర్జున్ కు జోడీగా పుష్ప సినిమాల్లో నటించింది రష్మిక. ప్రస్తుతం పుష్ప 2 లో చేస్తోంది. 'పుష్ప' కంటే ముందు.. రశ్మికా మందణ్ణ ఒక్కో సినిమాకి గాను రూ. 1 కోటి పారితోషికం తీసుకునేది. కానీ.. తన రెమ్యునరేషన్ ఫిగర్‌ను ఏకంగా రూ. 4 కోట్లకు పెంచేసిందట! అయితే.. తెలుగు సినిమాలకు మాత్రం రూ. 3 కోట్లు తీసుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే హిందీకో రేటు.. తెలుగుకో రేటునా అంటూ కమెంట్లు ఎదుర్కొంటున్న రష్మికకు మరో తలనొప్పి వచ్చి పడింది. రీసెంట్ గా సీతారామం సినిమాలో కీలక పాత్రలో నటించింది ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రష్మిక తన సినిమా విషయాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. అయితే ఇప్పుడు రష్మిక చేసిన ట్విట్ ఒక బాగా ట్రోల్ అవుతుంది. అది కూడా అల్లు అర్జున్ గురించి ట్విట్ చేయడంతో బాగా ఆడేసుకుంటున్నారు అల్లు ఫ్యాన్స్. అంతగా రష్మిక ఏంచేసిందనేది ప్రతి ఒక్కరికి ప్రశ్నగా మరింది. టాలీవుడ్ లో హిట్ లు కొట్టి ఎంత బాలీవుడ్ కి వెళ్లినంత మాత్రాన మరీ ఇంత మతిపరుపా? లేక ఇంకేమైనానా అంటూ రష్మికాను ట్రోల్ చేస్తున్నారు నెటిజన్లు.. అయితే అల్లు అర్జున్ రీసెంట్ గా ఓయాడ్ కోసం తన లుక్ స్టైల్ మొత్తంగా మార్చేసిన విషయం తెలిసిందే. ఆయాడ్ కోసం బన్నీ సూపర్ స్టైలిష్‌గా మారి లైట్ గా నెరిసిన జుట్టు, గడ్డం, నోట్లో సిగార్‌తో బన్నీ లుక్ ఓ రేంజ్ లో అదిరిపోయింది. దీనిపై నెటిజన్లు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. బన్నీ అభిమానుల ఈ లుక్ ను ట్రెండ్ చేస్తున్నారు. అయితే బన్నీ లుక్ పై ఇటీవలె రష్మిక చేసిన కామెంట్ ఇప్పుడు అల్లు అభిమానులు రష్మికాను తెగ ఆడేసుకుంటున్నారు. ట్రోల్ చేస్తున్నారు. అల్లు తన స్టైల్ ఫోటోను పోస్ట్ చేయగా దానికి ట్యాగ్ చేస్తూ రష్మిక ఓ కమెంట్ చేసింది. "సార్ మిమ్మల్ని ఒక్క క్షణం గుర్తుపట్టలేక పోయా"ను అంటూ కమెంట్ చేయడంగంతో షర్మికపై బన్నీ అభిమానులు సీరియస్ అవుతున్నారు. నీతో నటించిన హీరోను కూడా గుర్తుపట్టలేవా? ఇది మరీ ఓవరాక్షన్ అంటూ ట్రోల్ చేస్తున్నారు. ఇప్పుడు నీకు తెలుగు హీరోల కంటే హిందీ హీరోల ముఖాలే నీకు గుర్తంటాయా? అంటూ రష్మికపై మండిపడుతున్నారు. బన్నీనే గుర్తుపట్టకపోవడం దారుణం ఇది కాస్త ఓవర్ గా లేదు. ఎంత బాలివుడ్ ఆఫర్ వస్తే మాత్రం టాలీవుడ్ హీరోలు నీకు కనిపించడంలేదా అంటూ బన్నీ ఆర్మీ, రష్మీకను తెగ ట్రోల్ చేస్తున్నారు. ఇన్ని కామెంట్లు చేస్తున్నా రష్మిక నోరు మెదక పోవడం, లేకా ఎందుకులే అనుకుందో సైలెంట్ గా తన పని తను చేసుకుంటూ పోతుంది. అయినా రష్మికా అది హాస్యంగా కామెంట్ చేసిందో.. లేక బాలీవుడ్ లో ఆఫర్లు రావడం వల్ల చేసిందో గాని నెటిజన్లు తెగ కామెంట్లు చేస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in